# నిమజ్జన యాత్రకు పటిష్ట బందోబస్త్





**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:06సెప్టెంబర్2025:** సిద్దిపేట జిల్లాలో జరిగే నిమజ్జన యాత్రకు పటిష్ట బందోబస్తును పోలీస్ శాఖ చేపట్టింది. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సీపీ అనురాధ చర్యలు తీసుకున్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఇరువురు అధికారులు వినాయక నిమజ్జనం సందర్భంగా లాల్ కమాన్, ఓల్డ్ బస్టాండ్, విక్టరీ చౌరస్తా, ముస్తాబాద్ ఎక్స్ రోడ్ శోభయాత్ర జరిగే రోడ్ మ్యాప్ ను, నిమజ్జన ప్రదేశం కోమటి చెరువు ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి తగు సూచనలు సలహాలు చేశారు. భక్తిశ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగుతున్న వినాయక నిమజ్జన కార్యక్రమం. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక నిమజ్జనం సందర్భంగా బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు సిబ్బందికి పటిష్టమైన బందోబస్తు గురించి దిశా నిర్దేశం చేసిన సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి. ఈ బందోబస్తు కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, మరియు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సూచనలు పాటించాలి

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్:** 06సెప్టెంబర్2025 : గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ సూచనలు, మార్గదర్శకాలు సిద్దిపేట జిల్లాలో గణేష్ నిమజ్జనం సందర్భంగా, ట్రాఫిక్ శాఖ సజావుగా రవాణా సౌకర్యం, ప్రజా భద్రత కోసం కొన్ని ముఖ్యమైన సూచనలు, మార్గదర్శకాలను జారీ చేస్తోంది. ఈ ఉత్సవం సాంప్రదాయ పద్ధతిలో జరుగుతున్నప్పటికీ, రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అందరినీ కోరుతున్నామని సిద్దిపేట ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్ తెలిపారు. ముఖ్య సూచనలు గణేష విగ్రహ నిమజ్జనం కోసం ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాలను నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా మద్యం సేవించకుండా ఉండాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ నియమాలను ఉల్లంఘిస్తే, డ్రైవర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయి, అలాగే వాహనం సీజ్ చేయబడుతుంది. డ్రైవర్లు తమ డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ), ఇన్సూరెన్స్ మరియు ఇతర అవసరమైన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలి. నిమజ్జనం కోసం ఉపయోగించే ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాలు సరైన సాంకేతిక స్థితిలో ఉండాలి. బ్రేకులు, లైట్లు, టైర్లు, ఇతర ముఖ్యమైన భాగాలు సరిగ్గా పని చేస్తున్నాయని నిర్ధారించుకోవాలి. రోడ్డుపై ఆగిపోయే లేదా ట్రాఫిక్‌కు అడ్డంకిగా మారే వాహనాలను ఉపయోగించకూడదు. నిమజ్జన ఊరేగింపులు రోడ్డుపై ఎక్కువ సమయం ఆగకుండా, సావధానంగా మరియు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా నిర్వహించాలి. ట్రాఫిక్ ప్రవాహం నిరంతరంగా కొనసాగేలా చూడాలి. ఊరేగింపులు ప్రధాన రహదారులపై డాన్సులు చేస్తూ ఆగకూడదు. ట్రాఫిక్ పోలీసుల సూచనలను ఖచ్చితంగా పాటించాలి. వారితో సహకరించాలి. ఊరేగింపుల సమయంలో రద్దీని నియంత్రించడానికి ఆర్గనైజర్లు తగిన సంఖ్యలో వాలంటీర్లను నియమించాలి. అత్యవసర వాహనాలు (అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు) కోసం రోడ్డు ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచాలి. అగ్నిప్రమాదాలను నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి, ముఖ్యంగా దీపాలు, జెనరేటర్లు, ఇతర విద్యుత్ పరికరాల వాడకంలో పర్యావరణ అనుకూల గణేష్ విగ్రహాలను ఉపయోగించాలని మరియు నిమజ్జనం కోసం



నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాల వాడకాన్ని నివారించాలి. నిమజ్జన ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినా, మద్యం సేవించి వాహనం నడిపినా, లేదా ఇతర అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్నా, సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. ట్రాక్టర్ లేదా ఇతర వాహనాలతో పాటు డ్రైవర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయి. వాహనం సీజ్ చేయబడుతుంది. ఊరేగింపుల సమయంలో లౌడ్‌స్పీకర్లు, సంగీత పరికరాల వాడకం స్థానిక నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లను ఉపయోగించకూడదు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఉన్నాయి కాబట్టి ప్రజలు ముందస్తు ప్రణాళికతో ప్రయాణించాలి. ట్రాఫిక్ అడ్వైజరీలను స్థానిక పోలీస్ స్టేషన్ లేదా ట్రాఫిక్ శాఖ వెబ్‌సైట్‌లో తనిఖీ చేయవచ్చు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా హెల్ప్‌లైన్ నంబర్ 100ను సంప్రదించండి. సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ శాఖ ప్రజలందరినీ ఈ మార్గదర్శకాలను పాటించి, గణేష్ నిమజ్జన ఉత్సవాన్ని సురక్షితంగా, శాంతియుతంగా, పర్యావరణ అనుకూలంగా జరుపుకోవాలని కోరుతోంది. మీ సహకారం మా బాధ్యతను సులభతరం చేస్తుంది.

# హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**దర్శించుకున్న భక్తులు ఆలయాల వద్ద అన్నదానం**

**కౌడిపల్లి సిద్దిపేట పవర్ ప్రతినిధి :**మండల పరిధిలోని వెల్మకన్న గ్రామంలోని బాలవీర హనుమాన్ ఆలయం వద్ద శనివారం పురస్కరించుకుని ఆలయ పూజారి మెట్టు రాములు శర్మ ఉదయం పంచామృత అభిషేకం, చందనలంకరణ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాలను అందించారు. ఆలయం వద్ద ముప్పిడి శ్రీనివాస్ గౌడ్ దుల్పెట్ ( ఎన్ఆర్ఐ లండన్ ) భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల పరిధి కంచనపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం వద్ద పట్లోరీ బాలకిషన్ రావు,తిరుపతి రావు, కుటుంబ సభ్యులు (ఎన్నారై అమెరికా) అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొట్టాల గ్రామ హనుమాన్ ఆలయం వద్ద ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు కలిసి అందరి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు రాములు శర్మ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు, దాతలకు ఆశీర్వచనాలు అందజేసి భగవత్ కార్యక్రమాల్లో అందరు భాగస్వాములు కావాలన్నారు. భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు





# గట్ల మల్యాల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

- **ఎన్నిక ఏకగ్రీవం**
- **అధ్యక్షునిగా వర్కోలు లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా మోర మోహన్**

**సిద్దిపేట పవర్ నంగునూరు, సెప్టెంబరు 6:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్ల మల్యాల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక (జీఎంఈఏ) ఏకగ్రీవంగా జరిగింది. శుక్రవారం గట్ల మల్యాల ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ఎన్నిక వివరాలను శనివారం అధికారికంగా ప్రకటించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా వర్కోలు లక్ష్మయ్య ఉపాధ్యక్షులుగా చిలుక వెంకటయ్య, నోముల లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మోర మోహన్, కార్యదర్శులుగా అనుమాసు పరమేశ్వర్ రెడ్డి, బి.కవిత, కోశాధికారిగా తిప్పని అశోక్, కార్యవర్గ సభ్యులుగా పి.గోపాల్, ఎల్లారెడ్డి, దుబ్బుడు రాజిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, గౌరవ అధ్యక్షునిగా బెజుగామ వెంకటేశం, గౌరవ సలహాదారులుగా వి.నరసింహారెడ్డి, నోముల లింగం, ఎడ్ల వెంకట నరసింహారెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వర్కోలు లక్ష్మయ్య మాట్లాడుతూ గట్ల మల్యాల ఉద్యోగుల





సంఘం సభ్యుల సహకారంతో గ్రామాభివృద్ధిలో పాలుపంచుకుంటామని తెలిపారు.





# కత్తి మీద సాము లాంటిది జర్నలిస్టు వృత్తి..!

- **నీ జీవితాన్ని మార్చుకో... తర్వాత సమాజాన్ని మార్చు**
- **జీవనాన్ని జర్నలిస్టు వృత్తి పై ఆధారపడకు**
- **కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి**

**సిద్దిపేట పవర్, దుబ్బాక, సెప్టెంబర్ 06:** జర్నలిస్టు వృత్తి కత్తి మీద స్వాముల లాంటిదని, మార్చేది ఒక జర్నలిస్ట్ పైన ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రజనీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం జర్నలిస్ట్ డే సందర్భంగా కోమటిరెడ్డి ఫంక్షన్ హాల్ లో దుబ్బాక జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా అన్నారు. రాజకీయ నాయకులు ఎదగాలంటే కూడా ఒక జర్నలిస్టు మీద కీలక పాత్ర ఉంటుందన్నారు. ప్రభుత్వం కూడా ఎలాంటి వేతనాన్ని ఇవ్వకుండా సమాజ మార్పు కోసం జర్నలిస్టులు పనిచేస్తున్నారన్నారు. మొదలుగా జర్నలిస్టు జీవితాన్ని మార్చుకొని.. తర్వాత మార్పు కోసం పనిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జర్నలిస్ట్ వృత్తిపైనే ఆధారపడి జీవనాన్ని కొనసాగించొద్దని ఆయన తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పని చేసే వృత్తి జర్నలిజమని అన్నారు. నిజాన్ని నిర్భయంగా సమాజానికి సమాచారం అందించే వృత్తి జర్నలిస్టు అన్నారు. జర్నలిస్టు వృత్తిపై ఆధారపడి జీవనాన్ని కొనసాగించ లేరన్నారు. జర్నలిస్ట్ డే సందర్భంగా జర్నలిస్టులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, కె ఆర్ ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.







# ఆయిల్ పామ్ పంటలో అంతర్ పంటలు సాగు ఎంతో లాభదాయకం






- **ఆయిల్ ఫెడ్ అధికారి ఫణీంద్ర**
- **సిద్దిపేట జిల్లా రైతులకు అవగాహన**

**సిద్దిపేట పవర్ ఖమ్మం,సెప్టెంబర్ 06:** ఆయిల్ ఫామ్ తోటల్లో అంతర్ పంటలు ఎంతో లాభదాయకమని ఆయిల్ ఫెడ్ అధికారి ఫణీంద్ర సూచించారు. శనివారం సాయంత్రం ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేట సమీపంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాగుచేసిన ఆయిల్ ఫామ్ తోటలో కోకో ,వక్క పంటల సాగును సిద్దిపేట జిల్లాలోని నంగునూరు,దుబ్బాక,మిరుదొడ్డి మండలాల రైతులు పరిశీలించారు. అనంతరం ఆయిల్ ఫెడ్ అధికారి ఫణింద్ర రైతులకు అవగాహన కల్పించారు.చింతపల్లి గ్రామానికి చెందిన రైతు,నర్సరి నిర్వాహకులు ఎస్ కే బాజీ క్షేత్రంతోపాటు ప్లాంట్ ను సందర్శించిన అనంతరం వివిధ ప్రాంతాలలో సాగవుతున్న కోకో,వక్క పంటల పై అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా ఫణీంద్ర మాట్లాడుతూ పామాయిల్ తోటల్లో ఎకరాకు 250 చొప్పున మొక్కలు నాటుకోవచ్చునని ఫలితంగా అదనంగా ఎకరాకు 50 వేల వరకు సంవత్సరానికి ఆదాయం వస్తుందన్నారు సంవత్సరానికి ఒకసారి పంట చేతికి వస్తుందని ఐదు సంవత్సరాలకు మొదటి క్రాపు వస్తుందని ఆయన వివరించారు. అదేవిధంగా సాగు చేస్తే రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని ఆయన తెలిపారు. వక్క ,కోకో పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు, సిద్దిపేట జిల్లాలో వేలాది ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగు అవుతుంది. మండలంలోని నర్మెట్ట గ్రామంలో ఆయిల్ పామ్ కర్మాగారం నిర్మాణం అవుతుండడంతో రైతులు ఆసక్తిగా పామాయిల్ తోటలను సాగు చేస్తున్నారు. అయితే చాలామంది రైతులు పామాయిల్ తోటలలో అంతర్ పంటలను సాగు చేయడం లేదు.దీంతో రైతులకు పంటలలో అంతర్ పంటలు సాగు చేస్తే రైతులు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు ఎన్నో సందర్భాల్లో రైతులకు సూచించేవారు ఈ ప్రయత్నంలో భాగంగా సంబంధిత అధికారులు రైతులను ఖమ్మం జిల్లాలో అక్కడి రైతులు సాగుచేసిన పామ్ అయిల్ అంతర్ పంటలను పరిశీలించడం కోసం వాహనాల్లో అక్కడికి తీసుకెళ్లి అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో ఆయిల్ పేడ్ అధికారులు శ్రీకర్ రెడ్డి,నితీష్, హరీష్ , ఆంజనేయులు, రైతులు రాగుల సారయ్య, బద్దిపడగ కిష్టారెడ్డి, కూతురు రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి,రంగు రాజు గౌడ్, రమేష్ రాజు, నాగేంద్రం, యెల్లెంకి రవీందర్ రెడ్డి,నిమ్మ వెంకట్ రెడ్డి,వల్లపు రెడ్డిరాంరెడ్డి, విజేందర్ రెడ్డి, ఉల్లిమల్లయ్య, ఎడ్ల రవీందర్ రెడ్డి, రమేశ్,రాకేష్, కృష్ణ నర్సింలు,రాజయ్య తదితరులు పాల్గొన్నారు.






# ఉపాధ్యాయుల కృషికి అద్దం టీఎల్ఎం మేళా

**ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి,**
**డీఈవో , సిద్ధిపేట జిల్లా**

**సిద్దిపేట పవర్ నంగునూరు, సెప్టెంబరు 6:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి వారు తయారుచేసిన బోధన అభ్యసన ఉపకరణాల(టీఎల్ఎం) మేళాలు అద్దం పడతాయని జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాస రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి బోధనా అభ్యసన ఉపకరణాల మేళాను డీఈవో శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనోపకరణాలు విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవడానికి దోహదం చేస్తాయని చెప్పారు. బోధనోపకరణాలను తరగతి గదిలో ప్రతి ఉపాధ్యాయుడు తప్పకుండా వినియోగించి పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. జిల్లాలోని ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. జిల్లాలోని ఉపాధ్యాయుల కృషి వల్ల గత మూడేళ్లలో సిద్దిపేట జిల్లా ముందజలో ఉందని తెలిపారు. విద్యాభివృద్ధికి గుర్తింపుగా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మొదటిసారిగా జిల్లా కలెక్టర్ తో పాటు, తనను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మానించారని చెప్పారు.





ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా పనిచేసి వచ్చే సంవత్సరం కూడా విద్యాభివృద్ధిలో మరింత మెరుగైన స్థానం కోసం కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం బోధనాభ్యసన ఉపకరణ మేళాలో ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనోపకరణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ డీఈవోగా ఎంపికైన జిల్లా డిఈఓ శ్రీనివాసరెడ్డిని మండల విద్యాధికారి ఆధ్వర్యంలో మండలంలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశరెడ్డి, నంగునూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నాగార్జున రెడ్డి, రమేశ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పార్థసారథి, మనీష్ కుమార్, జయపాల్ యాదవ్, బాలకిషన్, బండారు ప్రసాద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న టిఎల్ఎం మేళా**

నంగునూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనోపకరణాల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల్లో ఆలోచనా శక్తితో పాటు సృజనాత్మక శక్తిని పెంపొందించే విధంగా ఈ బోధన ఉపకరణాలు ఉన్నాయి. వీటిని తిలకించిన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి.